వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, సెప్టెంబర్21 : యాదగిరి గుట్టలో లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతు సాగింది. భక్తులు పాల్గొని కల్యాణ తంతును వీక్షించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్పించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ నిర్వహించారు. పాతగుట్ట లక్ష్మీనరసింహ ఆలయంలోనూ నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సంకష్ట హరచతుర్థి వ్రతం సందర్భంగా అనుబంధ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 17,69,083 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గుట్టలో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లిదండ్రులు.. గురువులది సమాన బాధ్యత

● పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, సెప్టెంబర్21 : విద్యార్థులను క్రమ శిక్షణ గల పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులది, తల్లిదండ్రులది సమాన బాధ్యత అని పద్మశ్రీ పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్య అన్నారు. వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి క్రమ శిక్షణ చాలా అవసరమన్నారు. పిల్లలకు ఇంటివద్ద చదువుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూరెళ్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లె మోహన్‌రెడ్డి, దాతలు తూటి మురళీధర్, ఈడెం శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ పులగం సులోచన పాల్గొన్నారు.

కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఓటరు జాబితాలో సవరణ చేయాలని కలెక్టర్‌కు వినతి

వలిగొండ, సెప్టెంబర్21 : మండల పరిధి సంగెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రిజిస్టర్ ఓటర్ల జాబితాను క్రమ పద్ధతిలో సవరణ చేయాలని గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎన్నికల జాబితా రూపొందించారన్నారు. మొదటి వార్డులో ఉండాల్సిన ఓటర్లను 2, 4, 6 వార్డులో చేర్చారని, ఇంటి క్రమ సంఖ్య ప్రకారం ఓటర్ల జాబితాను చేపట్టలేదని తెలిపారు. మొదటి వార్డు ఓటర్లను 6వ వార్డులో, 6 వ వార్డు ఓటర్లను 2, 3 వార్డుల్లో చేర్చడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు వరికుప్పల మల్లేశం, ఉండాటి వెంకటేశం, నాగరాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వైఆర్‌జీకేర్ లింకు వర్కర్ మాదాను ఆరోగ్యరాణి ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని రాయగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యరాణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నార. వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమాభిమానాలతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యరాణి

కస్తూర్బాలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

చౌటుప్పల్, సెప్టెంబర్ 21 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు జూనియర్ ఇంటర్ విద్యార్థినులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సమీక్షలు సరే..నిధులేవి ?

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, సెప్టెంబర్ 21 : ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలకు సమీక్షలతో సరిపెట్టకుండా వెంటనే నిధులను విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. సిరిపురం సీపీఎం గ్రామ శాఖ సభలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మూసీ ఆధారిత చిన్న నీటి వనరుల్లో ముఖ్యమైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలు ప్రారంభించి 20సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని, లేని పక్షంలో రైతులను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్గూరి అంజయ్య, అంబటి మల్లారెడ్డి, బడుగు రమేశ్, మిర్యాల భాస్కర్, అంబటి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

మహిళలు పోషకాహారాన్ని తీసుకోవాలి : ఏసీడీపీఓ

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : ప్రతి ఒక్కరూ సంపూర్ణ పోషకాహారాన్ని తీసుకున్నప్పుడే రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని ఏసీడీపీఓ రమ సూచించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఊర్మిళ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు దంతూరి భాగ్యమ్మ, యమున, లక్ష్మి, ఆశవర్కర్ సంధ్య, ఆయాలు సంతోష తదితరులు పాల్గొన్నారు.

చందుపట్లలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ రమ

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

చౌటుప్పల్ : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు

రామన్నపేటలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆలేరులో బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి తరం ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

ఆలేరు రూరల్ : కొలనుపాకలో భక్తమార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్యక్షుడు నోముల వాసుదేవ్, సంఘం నాయకులు ఎలగందుల రవి, అంకం రాజు, బోగ శ్రీను, అంకం రాజయ్య, మడూరి యాదగిరి, వల్లాల బాలయ్య, మడూరి లక్ష్మయ్య, కటకం మల్లేశం, గంజి సుధాకర్ పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని రఘునాథపురంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు ఎలగందుల మహేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, శంకరయ్య, శ్రీనివాస్, భిక్షపతి, బాబు, కృష్ణమూర్తి, బుచ్చిరాములు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు చిక్క నర్సింహ, బడుగు మాణిక్యం, పోలోజు శ్రీధర్‌బాబు, తాడూరి పరమేశ్, వర్కాల వెంకటేశం గౌడ్, సుంకరి జంగయ్య గౌడ్ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు. పద్మశాలి సేవా విభాగం అధ్యక్షుడు సాయిని యాదగిరి, ఎక్కలదేవి శ్రీనివాస్, గంజి వెంకటేశ్, రచ్చ సంతోష్, నామాల జగన్, పాపని లక్ష్మయ్య, బోడ ఈశ్వర్, బత్తిని రాఘవేందర్, రవి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. సూరెపల్లి వెంకటేశ్, సూరెపల్లి శివాజీ, వంగారి రఘు, దోర్నాల అంజయ్య, రామకృష్ణ, జనార్దన్, వెంకటేశం, లక్ష్మీనారాయణ, భాస్కర్, విష్ణు పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంతోపాటు, వివిధ గ్రామాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం మండల గౌరవ అధ్యక్షుడు సంగిశెట్టి సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు రచ్చ యాదగిరి, నాయకులు అప్పం లక్ష్మీనర్సు, బడుగు రమేశ్, కైరంకొండ నాగభూషణం, కొంగరి జానయ్య, పున్న వెంకటేశం, మిర్యాల భాస్కర్, కోడి పాండు నాథ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయకుమార్, గుండు మధు, కర్ణాటి రవి, నాయకులు గునిగంటి మల్లేశంగౌడ్, చేరాల చిన్న నరసింహ, మంగళపల్లి శ్రీహరి, అంకం పాండు, తడక యాదగిరి, ఏలె భిక్షపతి రాపోలు జ్ఞానేశ్వర్, బోగ నరసింహ, భారత బాలరత్నం, గంజి అంజయ్య, కడవేరు చంద్రమౌళి, సంగం చంద్రయ్య, భారత వాసుదేవ్, కర్నాటి అంజమ్మ పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, నాయకులు పుట్ట మల్లేశ్ గౌడ్, కౌన్సిలర్ బేతి రాములు, ఆడెపు బాలస్వామి, పత్తి వెంకటేశ్, పాశికంటి శ్రీనివాస్, జల్లి నరసింహులు, జూకంటి చిన్న ఉప్పలయ్య, దయ్యాల సంపత్, నారాయణ, సిద్దులు, ఎండీ ఫయాజ్, నర్సింగరావు, శ్రీను పాల్గొన్నారు.

రాజాపేట : రఘునాథపురంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

సంస్థాన్ నారాయణపురంలో ..

అంకిత భావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్

రాజాపేట, సెప్టెంబర్ 21 : ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్ అన్నారు. మండల వ్యవసాయాధికారి మాధవి బదిలీపై వెళ్లిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాధికారి మాధవి పన్నెండేండ్లుగా రైతులతో స్నేహభావంగా మెలిగి, అందుబాటులో ఉండి విస్తృత సేవలు అందించారన్నారు. అనంతరం పలువురు నాయకులు, రైతులు పూలబొకేలు, శాలువాలతో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా, మండల వ్యవసాయాధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాజాపేటలో ఏఓ మాధవిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, తదితరులు

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రాజాపేట, సెప్టెంబర్ 21 : ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నేత ఏచూరి సీతారాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజా వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. తపాసుపల్లి ప్రాజెక్ట్ ద్వారా మండలానికి సాగు నీరు అందించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వెంటనే గంధమల్ల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మంగ నర్సింహులు, బబ్బురి పోశెట్టి, రాధమ్మ, రాంచంద్రం, మాధవి, నర్సిరెడ్డి, రమాదేవి, కౌసల్య, శోభారాణి, పుష్ప పాల్గొన్నారు.

రాజాపేటలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్,

రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబర్ 21 : రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘం భవనంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపూజీ 12 వర్ధంతి సందర్భంగా సమగ్ర కులగణన, సామాజిక న్యాయంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వెనుకబడిన కులాల అభివృద్ధి సమగ్ర కులగనన చేపట్టినప్పుడే వాటి ఫలాలు అందరికీ అందుతాయన్నారు. స్థానిక సంస్థల్లో కాకుండా చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భారత వాసుదేవ్, తడక యాదగిరి, సీత దామోదర్, చిక్క కృష్ణ, భారత బాలరత్నం, కేఎల్‌బీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రాపోలు జ్ఞానేశ్వర్, భారత లవకుమార్, భారత వాసుదేవ్, గుండ్ల రాజుయాదవ్, ప్రభాకర్, పెంటయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మీశ్రీనివాస్

కామర్స్ జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

వలిగొండ, సెప్టెంబర్21: మండలంలోని లోతుకుంట గ్రామంలో గల మోడల్ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రయీసున్నీసా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంకాం(కామర్స్), బీఎడ్ ఉన్నవారు 25వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థిలకు అవగాహన

రాజాపేట, సెప్టెంబర్ 21 : మండలంలోని కుర్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ అధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తోపాటు పోషకాహారం, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వప్న, ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పరమేశ్వర్లు, సుజాత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన చీదరకంటి స్వామి కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ చందుపట్ల బ్యాంకు సంఘ సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ.30వేల ఆర్థిక సాయాన్ని సంఘ సిబ్బంది శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

'24న బహిరంగ సభకు డీలర్లు తరలిరావాలి'

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24న పటాన్‌చెర్వు జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు మన్నె యాదగిరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రేషన్ డీలర్లు బాధ్యతగా వచ్చి సభను జయప్రదం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన కనీస గౌరవ వేతనం రూ.5 వేలు, క్వింటాలుకు రూ.300 కమీషన్ సాధించే దిశగా డీలర్లు అడుగులు వేయాలని తెలిపారు.

బస్సు నడుపాలని గ్రామస్తుల ధర్నా

రామన్నపేట : వెల్లంకి గ్రామంలో బస్సు ముందు ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రామన్నపేట, సెప్టెంబర్21 : రామన్నపేట – చౌటుప్పల్ బస్సును యథావిధిగా నడుపాలని వెల్లంకి గ్రామస్తులు శనివారం బస్సు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట – చౌటుప్పల్ బస్సును గత 20 రోజుల నుంచి హైదరాబాద్‌కు నడిపిస్తున్నారని, దీనివల్ల గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిపో మేనేజర్ అధికారులతో మాట్లాడి బస్సును యథావిధిగా నడుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

తాడుతో లాక్కెళ్లిన బర్రె.. చెరువులో మునిగి రైతు మృతి

రామనర్సయ్య

మోత్కూరు, సెప్టెంబర్ 21 : మండలంలోని పాటిమట్లలో చెరువులో మునిగి రైతు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నాగపురి రామనర్సయ్య(70) తన పాడి బర్రెను తాడుతో కట్టేసి మేపాడు. సాయంత్రం బర్రెను తాడుతో తీసుకొని వస్తుండగా సమీపంలోని చెరువులోకి లాక్కెళ్లింది. బర్రెకు కట్టిన తాడును రామనర్సయ్య తన చేతికి చుట్టుకున్నాడు. ఈ క్రమంలో బర్రె నీళ్ల కోసం చెరువులోకి లాక్కెళ్లడంతో రైతు నీటిలో మునిగి పోయాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి తీసుకొచ్చే క్రమంలో రామనర్సయ్య మృతి చెందాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు పంపించారు.

పూర్ణగిరిలో అన్నదానం

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : మండలంలోని నమాత్‌పల్లిలో గల స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ధ్యానబోయిన శిరీషాఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు బత్తిని రాములు స్వామి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పవన్‌కుమార్‌శర్మ, వెంకటేశ్, భక్తులు బత్తిని కుమార్‌గౌడ్, జంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, బత్తిని వెంకటేశ్, తిరుమలేశ్, శివ, మహేందర్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నమాత్‌పల్లిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వినాయకుని విగ్రహాల వద్ద..

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల వద్ద శనివారం దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా విజేతలకు బహుమతులు

రాజాపేట, సెప్టెంబర్ 21 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్14-17 విభాగాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు రమేశ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అండర్ 17 బాలుర విభాగంలో కబడ్డీ (రఘునాథపురం), వాలీబాల్ (బొందుగుల), ఖోఖో (సాంఘిక సంక్షేమ గురుకులం).. బాలికల విభాగంలో కబడ్డీ (రాజాపేట) వాలీబాల్ (పాముకుంట) ఖోఖో (బేగంపేట).. అండర్ 14 బాలుర విభాగంలో కబడ్డీ (సాంఘిక సంక్షేమ గురుకులం), వాలీబాల్ (సాంఘిక సంక్షేమ గురుకులం), ఖోఖో (సాంఘిక సంక్షేమ గురుకులం).. అండర్ 17 బాలుర విభాగంలో రన్నింగ్ (సాంఘిక సంక్షేమ గురుకులం) అండర్ 14 విభాగంలో (సాంఘిక సంక్షేమ గురుకులం).. అండర్ 17 బాలికల విభాగంలో (రఘునాథపురం), అండర్ 14లో (దూదివెంకటాపురం) విజేతలుగా నిలిచినట్లు క్రీడల కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయంత, మంజులారెడ్డి, సత్యానంద్, లెనిన్, వీరభద్రం, జానయ్య, పీడీలు శోభరాణి, ప్రభ, వరలక్ష్మి, కృష్ణమూర్తి, సంపత్, పీఈటీలు నరేశ్, వెంకటేశ్, సుధాకర్, పవన్ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమేశ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 21 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నరేశ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తను తొలగించారు. గ్రామ అభివృద్ధి, సమాజ సేవ కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.జ్యోతి, అధ్యాపకులు హరిప్రసాద్, తులసి, వెంకటేశం, శివశంకర్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌కుమార్, చందన, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, మంజుల పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

చౌటుప్పల్‌లో స్వచ్ఛత హీ సేవ

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు.